క్లుప్తంగా

కళాశాలలో మధ్యాహ్న భోజన వసతి



ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలుపుతున్న కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు కళాశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నామని ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, సభ్యులు దేవతా కృష్ణమూర్తి, పల్లెం వేణుగోపాల్, అచ్యుత రామయ్య, రూపారాజు, రామకృష్ణ, సోమశేఖర్ ప్రసాద్‌తో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి విద్యార్థులకు దాతలు, కమిటీ సభ్యుల సహకారంతో మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని నిర్ణయించారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని బోయపల్లి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ గోపి తెలిపిన మేరకు వివరాలు.. కర్ణాటక పావగడకు చెందిన నాగరాజు, శిరకు చెందిన రామ్‌నాయక్ ఇద్దరూ ద్విచక్ర వాహనంలో కడపకు బయలుదేరారు. అయితే బోయపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగరాజుకు స్వల్ప గాయాలు కాగా రామ్‌నాయక్ తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపి 108 వాహనంలో క్షతగాత్రులను కర్ణాటక ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ హేమ, పైలట్ నాసీర్ 108లో చికిత్స చేశారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



అధికారులను సన్మానించిన దృశ్యం

ఎన్‌పీకుంట: ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న ఉపాధిహామీ ఏపీఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ జేఈ రమేష్, సీనియర్ అసిస్టెంట్ లోకనాథ్‌రెడ్డి, పీఆర్‌జేఈ ప్రసాద్, సీఓ సాదిక్ అలీను శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సన్మానించారు. పలువురు మాట్లాడుతూ .. విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తే తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్, వాటర్‌షెడ్ ఛైర్మన్ బయారెడ్డి టీఏలు, ఎఫ్ఏలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



మంటల్లో కాలిపోతున్న కారు

కనగానపల్లి: అగ్ని ప్రమాదానికి గురైన కారులో నుంచి బయటకు దూకి ఓ వ్యక్తి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. శనివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రహదారిపైనే బోల్తా పడింది. అదే సందర్భంలో కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించి, కారు కాలిపోయింది. అయితే కారు నడుపుతున్న వాహన యజమాని నారాయణస్వామి వెంటనే అప్రమత్తమై కారులో నుంచి బయటకు దూకి స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. రహదారిపై వెళ్తున్న వారు స్థానికులు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో కారు మొత్తం మంటల్లో కాలిపోయింది. ఈ సమయంలో జాతీయ రహదారి వెళ్తున్న వాహనాలు ఒక వైపు ఆగిపోవటంతో కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. హైవే సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. దీనిపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మూర్ఛతో పెయింటర్ మృతి



ధర్మవరం అర్బన్: మూర్ఛ వ్యాధితో ఓ పెయింటర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన సుబ్బరాయుడు ధర్మవరంలోని శారదానగర్‌లో ఒంటరిగా నివాసముంటూ పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం ఇంటి ఎదుట అరుగుపై కూర్చొని ఉండగా మూర్ఛ రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని పోలీసులు కోరారు.

ముగిసిన వార్డు ఉప ఎన్నికలు



గాండ్లపెంట: నాయకులతో కలిసి ఎమ్మెల్యే సిద్దారెడ్డిని కలసిన వార్డు సభ్యురాలు విజయ



బత్తలపల్లి: గెలుపొందిన వార్డు సభ్యురాలు లక్ష్మీనారాయణమ్మకు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న అధికారులు



అమడగూరులో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి గెలుపొందడంతో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

• వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన బ్యాల్ల లక్ష్మీనారాయణమ్మ టీడీపీ బలపర్చిన గిరక నారాయణమ్మపై 72 ఓట్ల తేడాతో భారీ విజయం సాధించింది. మొత్తం 128 ఓటర్లు ఉండగా 114 ఓట్లు పోలయ్యాయి.

టీడీపీ మద్దతు అభ్యర్థి నారాయణమ్మకు కేవలం 21 ఓట్లు మాత్రమే వచ్చాయి. అనంతరం గెలుపొందిన లక్ష్మీనారాయణమ్మకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దివాకర్, సిబ్బంది డిక్లరేషన్ ఫారం అందజేశారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. అంతకు ముందు గ్రామంలో నుంచి బత్తలపల్లి వరకు బైకు ర్యాలీతో కూడలికి చేరుకుని జై జగన్, జై కేతిరెడ్డి అంటూ నినాదాలు చేశారు. విజయోత్సవ వేడుకల్లో సర్పంచ్ సానే జయచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బీదాల ప్రతాప్‌రెడ్డి, సానే వీరారెడ్డి, సానే నాగేశ్వరరెడ్డి, సానే క్రిష్ణారెడ్డి, సానే బాస్కర్‌రెడ్డి, టి.భాస్కర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, ఏ.లింగమయ్య, నారాయణ స్వామి, తాటిచెర్ల, నాగార్జున, ఓబిలేసు, రవి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అక్కిం నరసింహులు, నరేంద్రరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, నారాయణరెడ్డి, సీతారామిరెడ్డి, బండి వీరనారప్ప, నాగభూషణ, గరిశలపల్లి శ్రీనివాసరెడ్డి బ్రదర్స్, ముసలప్ప పాల్గొన్నారు.

తలుపుల: ఉడమలకుర్తి పంచాయతీలోని సోమాల వాండ్లపల్లి 4వ వార్డు మెంబర్‌గా రమేష్ నాయుడు గెలుపొందినట్లు ఆర్ఓ శకుంతల తెలిపారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కృష్ణాపురం పంచాయతీలోని 7వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని మందల మంజుల టీడీపీ బలపరచిన అభ్యర్థిని వరలక్ష్మిపై విజయం సాధించింది. తన గెలుపునకు కృషి చేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి, గ్రామ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నేతలకు మంజుల కృతజ్ఞతలు తెలిపింది.

అమడగూరు: అమడగూరు పంచాయతీలోని 11వ వార్డుకు జరిగిన ఎన్నికలో టీడీపీ మద్దతు అభ్యర్థి సూర్యనారాయణపై వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి నారాయణస్వామి 1 ఓటుతో గెలుపొందారు. అమడగూరు బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వీట్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ షబ్బీర్, ఎంపీటీసీ పెద్దప్పయ్య పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని బనాన్ చెరువుపల్లి 9వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతురాలు డీ.విజయ 27 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. వార్డులో మొత్తం 242 ఓట్లు ఉండగా అందులో 165 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతురాలు డీ.విజయకు 94 ఓట్లు రాగా టీడీపీ మద్దతుదారుకు 67 ఓట్లు పోలయ్యాయి.

ఈదులపల్లి 3వ వార్డు ఏకగ్రీవం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఈదులపల్లిలో ఖాళీగా ఉన్న 3వ వార్డుకు జరిగిన ఎన్నికలో పాన్నూరు లింగప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ స్థానానికి ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వార్డు మెంబరుకు ఈఓఆర్డీ ఖాదర్‌బాషా ధ్రువకరణ పత్రాన్ని అందజేశారు.

గాండ్లపెంట: మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లి 9వ వార్డు సభ్యురాలిగా గెలుపొందిన డి.విజయ శనివారం కదిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.తన గెలుపునకు సహకరించినందుకు ఎమ్మెల్యేను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ తాతం జగన్ మోహన్, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాపురం వార్డు మెంబర్ మంజుల



వార్డు మెంబర్‌గా ఎన్నికైన దివాకర్‌రెడ్డి

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల గ్రామంలో 4వ వార్డు మెంబర్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి దివాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు యలక శ్రీనివాసరెడ్డి, సల్లాపురం బాల రమణారెడ్డి, వడ్డి లింగారెడ్డి తదితరులు అతడ్ని సన్మానించి అభినందించారు.

ఇంటింటికీ పథకాలు అందించడమే లక్ష్యం

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 39వ వార్డులో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి ప్లాటు వచ్చిందని కాని బిల్లులు రాలేదని పలువురు ఎమ్మెల్యేకు తెలిపారు. హౌసింగ్ ఏఈ బాలాజీతో మాట్లాడిన ఎమ్మెల్యే.. లబ్ధిదారులందరికీ త్వరలోనే బిల్లులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. మట్టి రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని రహదారులు నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు. కమిషనర్ బండి శేషన్నతో మాట్లాడి రహదారిని త్వరలో నిర్మించేలా చర్యలు చేపడుతామని తెలిపారు. కాలువలు శుభ్రం చేయలేదని ప్రజలు విన్నవించారు. పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలని పట్టణంలో ఎక్కడా ఇలాంటి సమస్యలు రాకూడదని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ సిబ్బంది చూడాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. వాటిని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, వార్డు కౌన్సిలర్ కడప రంగస్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంసీహెచ్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ధర్మవరం అర్బన్: ఎంసీహెచ్ ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఎంసీహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్) నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. నూతన ఆసుపత్రిలోని పనుల నాణ్యతపై ఆరా తీశారు. గదులను పరిశీలించారు. భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. మిగిలిన చిన్నపాటి పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు.

వైభవంగా వీరబయమ్మ విగ్రహ ప్రతిష్ట

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని చిగిచెర్లలో వీరబయమ్మ వీరశెట్టప్ప స్వాముల విగ్రహ ప్రతిష్టను గుడికాపులు, బుట్రా కులస్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు తెల్లవారుజాము నుంచే శిఖర సంప్రోక్షణ, శిఖర కళశము, అమ్మవారి యంత్ర స్థాపన చేశారు. అమ్మవారి ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం బింబదర్శనం, గోదర్శనం, కుష్మాండబలి, తదుపరి మహా మంగళ హారతితో మహోత్సవాలను ముగించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున అమ్మవారి కాపులు తరలి వచ్చి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లుగా వెంకటరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసింది.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటిదిన్నె అంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి చొరవతో దాతల సహకారంలో నిర్మించిన సీతారామ నివాస్ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో రాబోవు రోజుల్లో ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వచ్చే సంవత్సరం శ్రావణ మాసం ఉత్సవాలకు ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని వెల్లడించారు. ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం ఫ్లోరింగ్ వేయిస్తామన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, జెడ్పీటీసీ అనిత, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఈఓ రామాంజనేయులు, సర్పంచులు పంచరత్నమ్మ, శ్రీనాథ్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, డైరెక్టర్ ఆదిమూర్తి, జేసీఎస్ కన్వినర్ రాజశేఖర్, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రమణారెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఉత్తన్న, డీజె ఈశ్వర్‌రెడ్డి, డీఎస్, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్టలో శనివారం తెల్లవారుజామున లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃనిర్మాణానికి ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షురాలు జయశ్రీతో పాటు కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. నూతన ఆలయ నిర్మాణానికి దాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని ఆలయ కమిటీ అధ్యక్షురాలు జయశ్రీ పిలుపునిచ్చారు. రూ.25 వేలకు పైగా చందా అందించిన వారి పేర్లు శాశ్వతంగా శిలాఫలకంపై రాయిస్తామన్నారు. భక్తులు కెనరా బ్యాంకు అకౌంట్ నంబర్ 110074984103 జమ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, గడ్డం పార్థసారధి, పుట్లూరు నరసింహులు, కలవల మురళీధర్, జయప్రకాష్, నరేంద్ర, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో వస్తువులు, సామగ్రి కాలిపోయాయి. బాధితులు తెలిపిన వివరాలు.. మార్కెట్‌యార్డు ఎదురుగా నివసిస్తున్న తలారి వీరప్ప శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేశాడు. అనంతరం పక్కనే ఉన్న పశువుల దొడ్డిలో పడుకునేందుకు వెళ్లారు. ఉన్నట్లుండి ఇంట్లో నుంచి పొగలు వస్తుండటంతో వెంటనే తలుపులు తీసి చూశాడు. మొత్తం పొగ, మంటలతో ఇల్లు నిండిపోయింది. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని ఫర్నిచర్, వస్తువులు, సామగ్రి, ఫ్రిజ్, కబోర్డులు కాలిపోయాయి. రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధితుడు వీరప్ప తెలిపాడు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకటరామిరెడ్డి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం యర్రపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి (74) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, మాజీ రెస్కో ఎండీ చైర్మన్ దుద్దుకుంట వెంకటరామిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సత్యనారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, సహకార సంఘం అధ్యక్షుడు తిప్పారెడ్డి, మాజీ సర్పంచ్ నంజిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు మున్వర్‌బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు గోవిందరెడ్డి, అనిల్, హేమాద్రి, నాగేశ్వర్‌రెడ్డి, భాస్కర్ అదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థిని కీర్తికి నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మగ్బుల్ అహమ్మద్

తనకల్లు: ఓ మెడిసిన్ విద్యార్థినికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బీఎస్ మగ్బుల్ అహమ్మద్. వివరాలు.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఆర్టిస్ట్ శంకర్ కుమార్తె కీర్తికి తిరుపతిలోని శ్రీ బాలాజీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఆగస్టు 19వ తేదీన కళాశాలలో చేరాలి. ఇందుకు రూ. 3 లక్షలు ఫీజు చెల్లించాల్సి వచ్చింది. తండ్రి శంకర్ రూ.2.50 లక్షలు సమకూర్చుకున్నాడు. ఇంకా ఫీజు కోసం రూ. 50 వేల కోసం ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత మగ్బుల్ అహమ్మద్ శుక్రవారం రాత్రి వారి ఇంటికి వెళ్లి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆపద్బాంధవుడిలా ఆదుకున్న మగ్బుల్ అహమ్మద్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని విద్యార్థిని కీర్తితో పాటు శంకర్ కుటుంబ సభ్యులు తెలిపారు.

నల్లచెరువు: మండల పరిధిలోని దామవాండ్లపల్లికి చెందిన నీట్ విద్యార్థి దేరంగుల జశ్వంత్ రాజ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుడు పాల్యం సుధాకర్ శనివారం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు.

తనకల్లు: స్థానిక దళితవాడకు చెందిన ఆర్టిస్ట్ శంకర్ కుమార్తె కీర్తి ఉన్నత విద్య కోసం వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలెం సుధాకర్ శనివారం రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ వైద్య విద్యకు అవసరమైన సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే నల్లచెరువుకు చెందిన మరో వైద్య విద్యార్థి జశ్వంత్‌రాజ్‌కు రూ.20 వేలు అందజేశారు.

శ్రావణమాస పూజలు



నల్లమాడ: అలంకరణలో ఆంజనేయ స్వామి



పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మవరం కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శ్రావణ సందడి నెలకొంది. నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రిలోని యల్లమ్మ, పెద్దమ్మ, గంటాపురంలోని మారెమ్మ, బత్తలపల్లిలోని దుర్గమ్మ, గంగమ్మ, మహాలక్ష్మి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే తలుపుల, నల్లమాడలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చారు.

– సాక్షినెట్‌వర్క్:

పరామర్శ



కోటిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కురుకూరు కోటిరెడ్డి (70), సామల సిద్దారెడ్డి (67) అనారోగ్యంతో ఈనెల 6వ తేదీన మృతి చెందారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి చిత్రపటాల వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీలు రమణారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని గంగసానివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమణారెడ్డి (55) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రమణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు టీడీ శ్రీహరిరెడ్డి, శ్రీనివాసులనాయుడు, విజయ్‌రెడ్డి, హేమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈనెల 22వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9000862048 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

నల్లచెరువు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు తాము సాగు చేసే పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ భారతి తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఓరువాయి, కె.పూలకుంట గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ కాపీలతో సంబంధిత ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

కదిరి అర్బన్: పట్టణంలోని నల్లగుట్టవీధిలో నివాసం ఉంటున్న మంజుల, మహేష్‌నాయక్ దంపతుల కుమారుడు హర్షవర్దన్ శనివారం వీధి కుక్కల దాడిలో గాయపడ్డాడు. బాలుడు వీధిలో ఆడుకుంటుండగా వీధి కుక్కల గుంపు చిన్నారిపై దాడి చేసింది. స్థానికులు చికిత్స నిమిత్తం బాలుడిని ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ధర్మవరం అర్బన్: స్థానిక శివానగర్ తిక్కస్వామి ఆలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, రూ.15 వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా గంజాయి విక్రయిస్తూ సాకే శంకర్, ఆర్వేటి సాయి పట్టుబడ్డారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రెండు ట్రాక్టర్ల సీజ్

అమడగూరు: ఓడీచెరువు మండలంలో అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గోపి పేర్కొన్నారు. శనివారం మహమ్మదాబాద్ క్రాస్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేశామన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

విచారణ

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ఆర్‌జేసీ ఎండోమెంట్ రీజనల్ జాయింట్ కమిషనర్ విజయ్‌సాగర్ బాబు విచారణ చేపట్టారు.ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకుడు అంజన్‌కుమార్ స్వామిని వేర్వేరుగా విచారించారు. ఇద్దరి ఫిర్యాదులను స్వీకరించి ఉన్నతస్థాయి అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈనెల 16న జరిగిన పాలకమండలి సమావేశంలో ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకుడు అంజన్‌కుమార్ స్వామి మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశంలో ఈఓ శ్రీనివాసరెడ్డి అర్చకులకు అవమానించారని అంజన్‌కుమార్ స్వామి ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.